వీధులన్నీ శుభ్రంగా ఉంచాలి

- గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలు
- క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు


పోచారం తండాలో రోడ్లను శుభ్రం చేస్తున్న సిబ్బంది


నస్రుల్లాబాద్: లింగంపల్లిలో డ్రెయినేజీలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

సదాశివనగర్: వీధులన్నీ అద్దంలా తీర్చిదిద్దాలని ప్రత్యేకాధికారి లక్ష్మినారాయణ పారిశుధ్య కార్మికులకు సూచించారు. శనివారం సదాశివనగర్ ఉన్నత పాఠశాలలో చెత్తను తొలగించారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఎంపీవో రాము పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్నట్లు వెల్లడించారు.

నిజాంసాగర్: మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీలో చేపట్టిన పారిశుధ్య పనులను మండల ప్రత్యేక అధికారి విజయబాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గంగారం తదితరులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని పోచారం తండాలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి రాములు పాల్గొని పనులను పరిశీలించారు.

నాగిరెడ్డిపేట: ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో రోజూవారి పారిశుధ్య పనులను చేపట్టాలని ఎంపీపీ రాజ్‌దాస్ సూచించారు. మండలంలోని పోచారంలో చేపట్టిన పారిశుధ్య పనులను శనివారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులు ఉన్నారు.


బంజపల్లిలో..


పోచారంలో..


సదాశివనగర్‌లో..

ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ఏర్పాటు


బాన్సువాడలోని ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రంలో పాత వస్తువులను సేకరిస్తున్న మున్సిపల్ చైర్మన్


సరంపల్లిలో..

బాన్సువాడ: మేరీ లైఫ్.. మేర స్వచ్ఛ్ షహర్ కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పాత వస్తువుల సేకరణ కోసం రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాలను శనివారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పాత వస్తువుల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణ వాసులు ఇళ్లలో ఉండే వినియోగం లేని పాత వస్తువులను ఆయా కేంద్రాలల్లో అందజేయాలని సూచించారు. వచ్చే నెల 15వ తేదీ వరకు పాత వస్తువుల సేకరణ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, కమిషనర్ రమేష్, వైస్ చైర్మన్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామంలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని మున్సిపల్ కౌన్సిలర్ ఆకూల రూప ప్రారంభించారు. ఇందులో భాగంగా పాత బట్టలు, వస్తువులు, బొమ్మలు, ప్రజల వద్ద నుంచి సేకరించి లేని వారికి ఇస్తే ఉపయోగపడుతాయని, మిగిలిన వస్తువులను రీ సైకిల్ చేసి ఆయా కంపెనీలకు పంపుతామని తెలిపారు. సింగిల్ విండో డైరెక్టర్ బక్కన్నగారి రాజు, గోపాల్, ఆర్పీలు, మంజుల, మమత, డ్వాక్రా మహిళా సంఘాల అధ్యక్షులు కొత్తూరి లావణ్య, సంగిశెట్టి రవళి, మామిండ్ల మాధవి, మామిళ్ల జ్యోతి, శానిటేషన్ సిబ్బంది రాజేందర్, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సర్వే


సర్వే పనులను పరిశీలిస్తున్న దఫేదార్ రాజు

నిజాంసాగర్: మండలంలోని తున్కిపల్లి శివారులోని 532 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూములను శనివారం రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే చేశారు. ఆ సర్వే నంబర్‌లో 185 ఎకరాలు ఉండగా 70 ఎకరాలకు సంబంధించి పట్టా పాసు పుస్తకాలు వచ్చాయి. మిగితా భూము లు రైతులు కబ్జాలో ఉన్నా పట్టాపాసు పుస్తకాలు రాలేదు. ప్రభుత్వ భూములు కబ్జాలో ఉండి పంటలు పండిస్తున్న రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని ఉమ్మడి జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్‌రాజు తహసీల్దార్ నారాయణకు సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ అటవీశాఖ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్, తహసీల్దార్ నారాయణ, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, నాయకులు రాంచెందర్, విఠల్, శంకర్, కాశయ్య, సాయిలు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం


నిరసన దీక్షలో యాదవ సంఘం ప్రతినిధులు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ నుంచి విడుదల చేస్తున్న వ్యర్థపదార్థాలను అరికట్టాలని 26 రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించనందున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కాచాపూర్ వీడీసీ అధ్యక్షుడు మైపాల్ అన్నారు. శనివారం కాచాపూర్ గ్రామంలో యాదవ సంఘం ప్రతినిధులు దీక్షలో కూర్చొన్నారు. దీక్షకు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు జోగు శివరాజు, వీడీసీ ప్రతినిధులు గెల్లు రాకేశ్, ఊడెం సందీప్, సంపత్, రాజిరెడ్డి, మర్రి స్వామి, పబ్బతి రాజేందర్, బురిగారి నర్సింలు, సంగెపు మల్లేశం, లింగం, కామిండ్ల సత్యం, మెట్టు రాజయ్య, పూస శంకర్, జోగు యాదయ్య, రాములు, కమ్మరి మురళీ తదితరులు సంఘీభావం ప్రకటించారు.

స్కాలర్‌షిప్‌నకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక


రాజు నాయక్ చిల్లె సాయిరాజ్ కస్తూరి స్రుజన

గాంధారి: మండల కేంద్రమైన జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న లోండియా రాజు నాయక్, చిల్లెల సాయిరాజ్, కస్తూరి స్రుజన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)నకు ఎంపికై నట్లు హెచ్ఎం వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. వీరికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని హెచ్ఎం వెల్లడించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

మాచారెడ్డి: మండలంలోని కాకులగుట్ట తండాలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 6,140 నగదుతో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఎక్కడైనా పేకాడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆర్థికాభివృద్ధిపై దృష్టి

సదాశివనగర్: ఫిష్ పాండ్ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని అసిస్టెంట్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సూచించారు. శనివారం మండలంలోని భూంపల్లి శివారులో ఏర్పాటు చేసిన ఫిష్ పాండ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, సీసీలు రాములు, నరేందర్ రెడ్డి, లింగం, కృష్ణాంజలి, నిర్వహకులు నిర్మల, భారతి లు పాల్గొన్నారు.

పొదుపు డబ్బు బ్యాంకులో జమ చేయాలి


మాట్లాడుతున్న ఐకేపీ డీపీఎం రవీందర్

దోమకొండ: డ్వాక్రా సంఘాల సభ్యులు పొదుపు డబ్బులను వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలని ఐకేపీ డీపీఎం రవీందర్ సూచించారు. శనివారం దోమకొండలో వివిధ గ్రామ సంఘ సభ్యులతో సమావేశంలో నిర్వహించారు. సీఏలు సమ్మె చేస్తున్నందున డబ్బులు బ్యాంకులో కట్టడం మానేయవద్దని సభ్యులకు సూచించారు. వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తామని తెలిపారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం రాజు, సీసీలు రాజేశం, రమేష్, రామకృష్ణ, శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి యువతే కీలకం


మాట్లాడుతున్న టాస్క్ సీఈవో శ్రీకాంత్ సింహా

కామారెడ్డి టౌన్: దేశ అభివృద్ధికి యువత పాత్ర కీలకమని తెలంగాణ అకాడమి స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సీఈవో శ్రీకాంత్ సింహా అన్నారు. శనివారం స్థానిక శ్రీసాందీపని డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు హరిస్మరణ్‌రెడ్డి, జానార్దన్‌రెడ్డి, బాలాజీరావు, రాజేశ్వర్, ప్రిన్సిపాల్ సాయిబాబా, అధ్యాపకులు మనోజ్, రాజేందర్ పాల్గొన్నారు.

పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోండి


అవగాహన కల్పిస్తున్న తపాలా శాఖ సిబ్బంది

రాజంపేట: పెట్టుబడిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు వారిని ఆర్థికంగా ప్రోత్సహించేందుకు తపాలా శాఖ మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ అనే పథకాన్ని అమలు చేస్తున్నట్లు పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్ వెల్లడించారు. శనివారం సిబ్బందితో కలిసి ఆయన మండలంలోని కొండాపూర్, శేర్‌శంకర్ తండా పంచాయతీ పరిధిలలో ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక క్యాంపు నిర్వహిచినట్లు వెల్లడించారు. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంలో కనిష్టంగా రూ.1,000 , గరిష్టంగా రూ 2 లక్షల వరకూ జమ చే యవచ్చని ,వడ్డీ రేటు 7.50 శాతం లభిస్తుందని ఆయన పేర్కోన్నారు. పూర్తి వివరాల కోసం పోస్టాఫీసుల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం భిక్షపతి, ఎమ్‌వో వెంకట్ రాంరెడ్డి, రాజంపేట పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు న్యాయ సేవలు అందించాలి


ఏజీపీ లతారెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీఐ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులైన న్యాయవాది ఎన్.లతారెడ్డిని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షురాలుగా సేవలు అందించిన లతారెడ్డిని ఏజీపీగా నియమించడం సంతషకరం అని ఆర్టీఐ కమిటీ రాష్ట్ర డైరెక్టర్, న్యాయవాది ఎం.ఎ.సలీం అన్నారు. ఏజీపీగా పేదలకు న్యాయ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షుడు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న, ప్రతినిధులు ప్రదీప్‌కుమార్, రాజు, ఎస్.లింబయ్య, భాస్కర్, షబానాబేగం, విఠల్‌రావు, నర్సింహచారి, కాసర్ల లింగం,రవి కుమార్, డి.మల్లయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించని డాక్టర్లు

- రోగులకు తప్పని ఇబ్బందులు


పిట్లం ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు

పిట్లం: డాక్టర్లు సమయ పాలన పాటించడం లేదు. దీంతో పిట్లం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం ఉదయం 11 గంటలు దాటినా డాక్టర్ల కోసం కేటాయించిన కుర్చీలు ఖాళీగానే దర్శనం ఇచ్చాయి. స్థానిక ఆరోగ్య కేంద్రానికి పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లా కల్హేర్, కంగ్టి మండలాల నుంచి రోజూ 300 మందికి పైగా రోగులు వస్తుంటారు. డాక్టర్లు సకాలంలో విధులకు రాకపోవడంతో రోగులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. జిల్లా అధికారులు స్పందించి డాక్టర్లు సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొలతల ప్రకారమే కూలి


లింగాయిపల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ సాయన్న

కామారెడ్డి రూరల్: కొలతల ప్రకారం ఉపాధిహామీ పనులు చేస్తే రోజుకు రూ.272 కూలి వస్తుందని డీఆర్‌డీవో పీడీ సాయన్న సూచించారు. శనివారం మండలంలోని లింగాయిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫిష్‌పాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10:30 గంటల వరకే పనులు చేపట్టాలని సూచించారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రత ఒక్కరూ ఉపాధిహామీ పనులకు హాజరుకావాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్‌నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ మదిరె భూపతి ఉన్నారు.

కురుమలు సిద్ధరామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



కామారెడ్డి అర్బన్: కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య బాధ్యతలు చేపట్టడం కురుమ జాతికే గర్వకారణమని కురుమ యువ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం కేక్ కట్ సంతోషాన్ని పంచుకున్నారు. కురుమలు సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు సిద్ధరామయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురుమ చైతన్య సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.మహేష్, ఎర్రొళ్ల స్వామి, బుచ్చిరాజ్, కందూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విక్రయించిన మందులకు రసీదు ఇవ్వాలి


భిక్కనూరులో పురుగు మందుల విక్రయ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ అపర్ణ

భిక్కనూరు: రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు తదితర వాటికి వ్యాపారులు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ సూచించారు. శనివారం ఆమె భిక్కనూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. నాణ్యత లేని విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపుల వద్ద ధరల పట్టిక ఉండాలని సూచించారు. ఆమె వెంట ఏవో రాధ, ఏఈవోలు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

నిజాంసాగర్: నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్ ఫర్టిలైజర్ డీలర్లకు సూచించారు. శనివారం మండలంలోని మహమ్మద్‌నగర్‌లో ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త రకం వరి వంగడాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో క్లస్టర్ ఏఈవో మధుసూదన్, డీలర్లు వసంత్‌కుమార్, వెంకటేశం, జనార్దన్, వినోద్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని వీవోఏలు వెల్లడించారు. డిమాండ్ల సాధన కోసం వారు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. వారికి సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్, పట్టణ అధ్యక్షుడు రాజనర్సు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, బాలరాజు, సరిత, అనసూయ, సురేందర్, అంజమ్మ, ఉమాకాంత్, రాజు పాల్గొన్నారు.

25న జాబ్ మేళా

పెద్దకొడప్‌గల్: నిరుద్యోగుల కోసం ఈ నెల 25న బిచ్కుందలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి కోరారు. మండలంలోని వడ్లం గ్రామంలో శనివారం జాబ్ మేళా వాల్ పోస్టర్ల ఆయన ఆవిష్కరించారు. జాబ్ మేళాలో దాదాపు 50 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. సలహాలు, సూచనల కోసం 99125 03871 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, మలు గొండ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

బిచ్కుంద: మండలంలోని బండారెంజల్‌లో పగిలిన తాగునీటి పైప్‌లైన్‌కు శనివారం పంచాయతీ సిబ్బంది మరమ్మతు పనులు చేశారు. పైప్‌లైనలో పేరుకుపోయిన మట్టిని తొలగించి, క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ బాల్‌రాజ్ తెలిపారు. పారిశుధ్య పనుల్లో భాగంగా వీధులను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగించినట్లు పేర్కొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



భిక్కనూరు: ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా కోరారు. ర్యాలీలో కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, సునీత, నరసయ్య, రమాదేవి, సరిత, దిలీప్, నిరంజన్ శర్మ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కామారెడ్డి రూరల్: మండలంలోని రాఘవపూర్, రాఘవపూర్ తండాలలోని ప్రధాన కూడళ్ల వద్ద శనివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కదిరె సాగర్ గౌడ్ తెలిపారు. అదేవిధంగా శ్మశాన వాటిక వద్ద సోలార్ లైట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తుకారం, నరేష్, శ్రీకాంత్, ప్రవీణ్, సంతోష్, లక్ష్మణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. శనివారం తమ పుట్టిన రోజు సందర్భంగా సోదరులైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తొగరి రమేశ్, వెంకటేశ్ నెలకు సరిపడా సరుకులను పేదలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్, సర్పంచ్ సులోచన, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రావన్‌కుమార్, క్రిష్ణ, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నస్రుల్లాబాద్: మండల కేంద్రమైన నస్రుల్లాబాద్ ప్రధాన రహదారిపై పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాల్లేని వాహనదారులకు చలాన్ విధించారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రఘు, ప్రమోద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ బీమా తప్పనిసరి

పిట్లం: ప్రతి ఒక్కరికీ భీమా అవసరం అని స్టేట్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ పేర్కొన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే బాధిత కుటుంబానికి బీమా బాసటగా నిలుస్తోందన్నారు. బ్యాంక్ సిబ్బందితో కలిసి ఆయన మండలంలోని అన్నారం గ్రామంలో స్థానికులతో సమావేశమై సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన తదితర పాలసీల గురించి అవగాహన కల్పించారు.

వ్యాపారి మృతి


శ్రీశైలం (ఫైల్)

భిక్కనూరు: కామారెడ్డి ప్రాంతంలో తొలి అల్లం ఎల్లిగడ్డ వ్యాపారం చేసిన భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన పల్లె శ్రీశైలం (80) శనివారం మృతి చెందాడు. ఆయన 15 ఏళ్ల వయస్సు నుంచే వ్యాపారం ప్రారంభించాడు. వీరి ఇంటి పేరుకూడ పలువురు అల్లం అనే పిలుస్తారు.

యూనివర్సిటీలో సమస్యను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న వివాదాలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్గత పోరు వల్ల యూనివర్సిటీ ప్రతిష్ట మరింత దిగజారుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, నాయకులు విజయ్, అనీల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

మాచారెడ్డి: రక్తదానం ప్రాణదానంతో సమానమని మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావ్ అన్నారు. శనివారం రత్నగిరిపల్లె గ్రామంలో చల్ల విజయ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో చల్ల అంజిత్‌రెడ్డి నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ నర్సింగరావ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ శ్రీనివాస్‌నాయక్, నాయకులు రమేష్, రామ్మోహన్,రాజు, కడెం నారయాణ, పూల్‌చంద్‌నాయక్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం

మొక్కలకు రోజూ నీరు అందించాలి

సదాశివనగర్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లోని మొక్కలకు రోజూ తప్పనిసరిగా నీళ్ల అందించాలని ఏపీవో మధు సూచించారు. శనివారం మండల కేంద్రమైన సదాశివనగర్‌లోని నర్సరీని ఆయన పరిశీలించారు.

ఎల్‌వోసీ అందజేత

నాగిరెడ్డిపేట: మండలంలోని మేజర్‌వాడి గ్రామానికి చెందిన నాసన్‌పల్లి కిషన్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిద్దయ్య ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరి మాత ప్రతిమ, దివ్య సమాధిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి

దోమకొండ: సబ్ సెంటర్లలో రోగులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఇచ్చే రూ.50 వేలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి అన్నారు. శనివారం ఏఎన్ఎంలతో నిర్వహించన సమావేశంలో వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అవసరమైన సేవలు అందించాలని సూచించారు.

ఆలయ పునరుద్ధరణ పనులకు విరాళాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద బజార్‌లోని ప్రాచీన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణ పనులకు పలువురు దాతలు విరాళాలు ఇచ్చినట్లు ఆలయ ధర్మకర్త, అర్చకుడు మధు తెలిపారు. పాత వెంకటేశం రూ.25,200, దోమకొండ కృష్ణమూర్తి రూ.21,116, డి.సంతోష్‌కుమార్ జ్ఞాపకార్థం ఆయన అక్క భార్గవి రూ.11 వేలు, కాముని లక్ష్మినారాయణ రూ.11,116, టి.విఠల్‌గుప్తా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివ రూ.11 వేలు, రాంగోపాల్‌పేట ఎస్సై గోవర్ధన్ రూ.5 వేలు, సముద్రాల రమణ, ఎ.శ్రీధర్, ఎల్లిందుల సతీష్, సుదర్శన్‌గౌడ్‌లు ఆర్థిక సహాయం అందజేశారని వెల్లడించారు.

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల సర్వే

లింగంపేట: మండలంలోని బోనాల్, నల్లమడుగు, లింగంపల్లి(ఖుర్దు), రాంపూర్‌తండాలో ఐఈఆర్‌పీలు దివ్యాంగుల సర్వే నిర్వహించినట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వారి పేర్లు, వయస్సు, తరగతి, ఎక్కడ చదువుతున్నారనే వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పిలు శ్యామల, అశ్విని పాల్గొన్నారు.

28న వధూవరుల పరిచయ వేదిక

తాడ్వాయి: నిర్మల్ జిల్లా బాసరలో ఈనెల 28న గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో వధూవరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధి ఇందల్‌వాయి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి భోజన సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామారెడ్డి: మండల కేంద్రం రామారెడ్డితో పాటు ఇసన్నపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ఎల్లారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గం నాయకుడు మదన్‌మోహన్ శనివారం పరామర్శించారు. ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.